ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 6 అక్టోబరు 2024

జీవీఎంసీ కొరడా

- బే వాచ్, విరాగూ రెస్టారెంట్లకు నోటీసులు
- అనుమతి పత్రాలు, ఎన్‌ఓసీలు సమర్పించాల్సిందిగా ఆదేశం


విరాగూ రెస్టారెంట్

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి భీమిలి వెళ్లే మార్గంలో బీచ్‌ను ఆనుకొని అడ్డగోలు నిర్మాణాలు చేపట్టి వ్యాపారం నిర్వహిస్తున్న రెండు సంస్థలకు ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు నోటీసులు పంపారు. తొట్లకొండలో ఏపీటీడీసీ నుంచి లీజుకు తీసుకున్న భూమిలో వైసీపీ నాయకుల బృందం అడ్డగోలుగా సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టి గదులను అద్దెకు ఇస్తోంది. పర్యాటక శాఖ తీసుకున్న మద్యం లైసెన్స్‌ను ఉపయోగించుకొని ఎక్కువ ధరకు అమ్ముతోంది. అలాగే కాపులుప్పాడలో ఓ కార్పొరేటర్ గృహ నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకొని అక్కడ పబ్ నిర్వహిస్తున్నారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రహదారికి స్థలం విడిచిపెట్టకుండా నిర్మాణాలు చేపట్టారు. రాజకీయ సహకారం ఉండడంతో ఇన్నాళ్లూ వాటిని అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారు. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురిస్తుండడంతో ఆయా సంస్థల నిర్వాహకులకు వ్యాపారాలకు సంబంధించిన అనుమతులు ఉంటే పంపించాలని సమాచారం పంపారు. కానీ సదరు నిర్వాహకులు కనీస స్పందన లేకుండా మిన్నకుండిపోయారు. మరోవైపు వాటిపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్‌ఎంఎ)కి ఫిర్యాదు ... మిగతా 6వ పేజీలో


బేవాచ్ రిసార్ట్


స్టీల్‌ప్లాంట్ ఈడి (వర్క్స్) కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉక్కు ఉద్యోగులు

ఉక్కు ఉద్యోగుల ఆందోళన

నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు హెచ్‌ఆర్‌ఏ రద్దు, క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారి నుంచి భారీగా విద్యుత్ చార్జీలు వసూలు చేయడంపై నిరసన

- ఉదయం 10 గంటల నుంచి ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా
- హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని, విద్యుత్ చార్జీలు మినహాయించాలని డిమాండ్
- యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు


శనివారం రాత్రి 11 గంటలకు ఆందోళన కొనసాగిస్తున్న ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 5: విశాఖ స్టీల్‌ప్లాంటులో శనివారం ఉద్యోగులు ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ నిలుపు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారిపై మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ కొందరు ఉదయం పది గంటల సమయంలో ప్లాంటులోని ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలిసి ప్లాంటులో ఉన్న ఉద్యోగులంతా అక్కడకు చేరుకున్నారు. హెచ్‌ఆర్‌ఏ కోత, విద్యుత్ చార్జీల మోతను నిరసిస్తూ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లాంటులో సుమారు 11 వేల మంది నాన్-ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నారు. వీరిలో నాలుగు వేల మంది క్వార్టర్స్‌లో, ఏడు వేల మంది బయట ఉంటున్నారు. క్వార్టర్స్‌లో నివాసం లేని వారికి ఇప్పటివరకూ యాజమాన్యం హెచ్‌ఆర్‌ఏ చెల్లించేది. ఈ నెల నుంచి చెల్లించబోమని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ప్లాంటు క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఉద్యోగులకు విద్యుత్ రాయితీపై యూనిట్ 50 పైసలు చొప్పున ... మిగతా 6వ పేజీలో



ధాన్యలక్ష్మిగా శ్రీకనకమహాలక్ష్మి

జగదాంబ కూడలి, అక్టోబరు 5: శరన్నవరాత్రుల్లో మూడో రోజైన శనివారం బురుజుపేటలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం ప్రదానం


మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం అందజేస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

నగరంలోని పిఠాపురం కాలనీలో గల కళాభారతి ఆడిటోరియంలో శనివారం కిన్నెర ఆర్ట్స్ థియేటర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో నటుడు, నిర్మాత ఎం.మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

విశాఖలో సెంట్రల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు కృషి

- కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

- వార్త 7లో

మెకానికల్ అక్రమాలపై కమిషనర్ దృష్టి

ముడసర్లోవలోని గ్యారేజ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సంపత్‌కుమార్

- వాహనాల మరమ్మతులకు సంబంధించిన రికార్డులు పరిశీలన
- పర్యవేక్షణకు రిటైర్డు ఉద్యోగిని నియమించాలని నిర్ణయం
- రోజువారీ నివేదిక ఇవ్వాల్సిందిగా మెకానికల్ ఎస్‌ఈతోపాటు ప్రధాన వైద్యాధికారికి ఆదేశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అవినీతి ఊబిలో కూరుకుపోయిన జీవీఎంసీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయడంపై కమిషనర్ పి.సంపత్‌కుమార్ దృష్టిసారించారు. ఈ క్రమంలోనే మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న ముడసర్లోవలోని గ్యారేజీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల మరమ్మతులు, రికార్డుల నిర్వహణ, విడిభాగాల కొనుగోలు, అమర్చడానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.


ముడసర్లోవలోని గ్యారేజీని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

జీవీఎంసీకి చెందిన వాహనాల నిర్వహణ, మరమ్మతుల్లో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా పలువురు సభ్యులు ఆరోపణలు గుప్పించారు. అధికారులు, సిబ్బంది వాడుతున్న వాహనాలతోపాటు చెత్త తరలింపు, డ్రైనేజీల్లో పూడికతీతలు, రోడ్లు ఊడ్చే ... మిగతా 6వ పేజీలో

జల వనరుల శాఖ ఖాళీ

- ఉత్తరాంధ్రలోని ఐదు సర్కిళ్లకు ఒక్కరే ఎస్‌ఈ
- నాలుగు సర్కిళ్ల అదనపు బాధ్యతలు నిర్వహణ
- ఐదు ఈఈ పోస్టులూ ఖాళీ
- సీజన్‌లో కత్తిమీదసాములా ప్రాజెక్టుల పర్యవేక్షణ



విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడే ఉత్తరాంధ్ర జిల్లాల్లో జల వనరుల శాఖకు ఇంజనీర్ల కొరత ప్రధానమైన సమస్యగా మారింది. ఐదు సర్కిళ్లకు ప్రస్తుతం ఒక్కరే సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) ఉన్నారు. అలాగే ఐదు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత నెలలో చేపట్టిన బదిలీల్లో ఎస్‌ఈ పోస్టులు భర్తీ చేస్తారని ఆశించినా సీఈ, ఎస్‌ఈ హోదా కలిగిన అధికారుల కొరత ఉండడంతో సాధ్యం కాలేదంటున్నారు.

ఉత్తరాంధ్రలోని ఐదు సర్కిళ్లకు రెగ్యులర్ ఎస్‌ఈగా శంబంగి సుగుణాకరరావు ఒక్కరే ఉన్నారు. ఇటీవల వరకూ ఆయన విజయనగరం జిల్లా తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ఎస్‌ఈగా పనిచేస్తూ విశాఖపట్నంలో నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజా బదిలీల్లో విజయనగరం జిల్లా నుంచి సుగుణాకరరావును ఖాళీగా ఉన్న విశాఖపట్నం రెగ్యులర్ సర్కిల్ ఎస్‌ఈగా నియమించారు. తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు ఎస్‌ఈగా ఇంకా ఎవరినీ నియమించలేదు. కాగా శ్రీకాకుళం రెగ్యులర్ సర్కిల్ ఎస్‌ఈ పోస్టు చాలాకాలంగా ఖాళీగా ఉంది. ఇప్పటివరకూ ఇక్కడ ఈఈగా పనిచేసిన అధికారే ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. తాజా బదిలీల్లో ఈఈని బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అయితే పాలనాపరంగా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నాలుగు రోజుల క్రితం శ్రీకాకుళం రెగ్యులర్ ఎస్‌ఈగా కూడా సుగుణాకరరావు అదనపు బాధ్యతలు తీసుకున్నారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ఎస్‌ఈగా ఇంకా ఎవరినీ నియమించకపోవడంతో అక్కడ బాధ్యతలు కూడా సుగుణాకరరావే నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళంలోని వంశధార ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్‌ఈగా కృష్ణా డెల్టా సీఈ రాంబాబు కొనసాగుతున్నారు. విజయవాడలో కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఎస్‌ఈగా ఉంటున్న రాంబాబు అదనంగా కృష్ణా డెల్టా సీఈగా, వంశధార ఎస్‌ఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బొబ్బిలి రెగ్యులర్ సర్కిల్ ఎస్‌ఈగా పనిచేసిన అధికారి తాజా బదిలీల్లో విజయవాడ బదిలీ అయ్యారు. ఈ పోస్టును కూడా సుగుణాకరరావు ప్రస్తుతం పర్యవేక్షిస్తున్నారు. మొత్తం నాలుగు సర్కిళ్ల ఎస్‌ఈగా, ... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటులో ఆగని ఆందోళనలు - వార్త 11లో

2029 కల్లా విశాఖ రూపురేఖలు మారేలా ప్రాజెక్టులు

- జిల్లా విజన్ ప్లాన్ వర్క్‌షాపులో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్


వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్. చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఉన్నారు.

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదేళ్ల (2029కల్లా)లో విశాఖపట్నం రూపురేఖలు మారిపోయేలా వినూత్న ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాల సభ్యులతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ 2029కల్లా జిల్లా అభివృద్ధికి రూపొందించే ప్రణాళికలో స్థానిక పరిస్థితులను బేరీజు వేసుకుని ముందుకు సాగాల్సి ఉందన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో ... మిగతా 6వ పేజీలో

పాత నగరంలో మౌలిక వసతులకు సుధాకర్ వినతి



అమరావతిలో మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ దక్షిణ నియోజకవర్గ నేత ఎస్.సుధాకర్

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గంలో మౌలిక వసతులు మెరుగుపర్చడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శీతంరాజు సుధాకర్ కోరారు. శనివారం విజయవాడలో లోకేశ్‌ను కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాత నగరంలో శిథిలమైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లను మరమ్మతు చేయాలని, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. తాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని, పోర్టుకాలుష్యం తగ్గింపునకు తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. పాత నగరాన్ని ఆధునికీకరించేలా ప్రణాళిక అమలుచేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.



డాబాగార్డెన్స్‌లో అన్నపూర్ణేశ్వరిగా



సీతంపేటలో అన్నపూర్ణేశ్వరి అవతారం



సీతమ్మధారలో మీనాక్షిగా..



కుమ్మరివీధిలో పోలమాంబ అమ్మవారు

మాతా అన్నపూర్ణేశ్వరీ...పాహిమాం

సీతమ్మధార, అక్టోబరు 5: శరన్నవరాత్రి ఉత్సవాలు ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో వైభవంగా జరుగుతున్నాయి. సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని షిరిడి సాయిబాబా, ప్రసన్న వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి దేవాలయాల్లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రసన్న వెంకటేశ్వరస్వామిని తిరుమల వెంకటేశుని అవతారంలో అలంకరించారు. అలాగే దుర్గాదేవి అమ్మవారు మీనాక్షి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద పంపిణీ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతంపేటలోని పార్వతీశ్వర దేవాలయంలో పార్వతీదేవి అన్నపూర్ణేశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుంటున్నారు.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లోని శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భార్గవశర్మ సంప్రదాయ పద్ధతులతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. దివ్య మంగళహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో జీవీ రమాభాయి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగదాంబకూడలి: సుమారు వందేళ్ల చరిత్ర గల బహుముఖరూపాల పోలమాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటున్నారు. శనివారం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తిభజన గీతాలాపన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పోలమ్మకు భక్తితో నమస్కరించి మొక్కులు తీర్చుకున్నారు. నగరంలో ప్రఖ్యాతి గాంచిన దుర్గాలమ్మ శనివారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం మరో అలంకారం కోసం సిదం చేస్తున్నారు.

మురళీనగర్; దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మురళీనగర్ బాలయోగి గుడి దగ్గర శనివారం అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి, టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అతిథులుగా హాజరై భోజనాలు వడ్డించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అతిథులు ఉత్సవ నిర్వాహకుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, బాలయోగి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీపై సదస్సు

జ్ఞానాపురం, అక్టోబరు 5: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో అధునాతన సైన్స్ అండ్ టెక్నాలజీపై వృక్ష శాస్త్రం, బయోటెక్నాలజీ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి విభాగాల ఆధ్వర్యంలో శనివారం సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ ముఖ్యఅతిథిగా హాజరై నావల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీ డైరెక్టర్ అబ్రహం వర్గీస్‌తో కలసి దీన్ని ప్రారంభించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో కాలానుగుణ మార్పులు, అధునాతన ఆవిష్కరణలను అందరూ పంచుకోవటానికి ఈ సెమినార్ వేదిక అని అన్నారు. మరో అతిథిగా హాజరైన గీతం కళాశాల ప్రొఫెసర్ డా.పి.శాంతిలత విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డా.ఎం.పద్మసుందరి, కో-కన్వీనర్లు డా.ఎ.వీరబ్రహ్మం, ఊర్మిళ, సిస్టర్ హేమ, డా.అరుణా దేవి, డా.ఇ.హరిణి, డా.పి.కె. జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల ఆందోళన...

5వ పేజీ తరువాయి

ఇచ్చింది. ఇప్పుడు యూనిట్‌కు ఎనిమిది రూపాయల చొప్పున (గడిచిన ఏప్రిల్ నుంచి సెప్టెంబరు) వసూలు చేయాలని నిర్ణయం తీసుకుని, ఆ మేరకు సెప్టెంబరు నెల జీతాల నుంచి మినహాయించుకుంది. ఈ రెండు అంశాలపై ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని, విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాత్రి తొమ్మిదిన్నరకూ ఆందోళన కొనసాగిస్తున్నారు.

యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది: అఖిలపక్ష కార్మిక నాయకులు

ఉక్కు యాజమాన్యం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు ధ్వజమెత్తారు. ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తుందన్నారు ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తికి చర్యలు చేపట్టకుండా కేవలం ఉద్యోగుల తొలగింపు, ఇతర సంస్థలకు తరలింపు, ఆర్థిక ప్రయోజనాల్లో కోత విధింపు వంటి వాటిపై దృష్టి సారించిందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంకా పాత జీతాలతోనే స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు కాలం గడుపుతున్నారని, అవి కూడా సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. హెచ్‌ఆర్‌ఏను పునరుద్ధరించాలని, విద్యుత్ బిల్లులు రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, మంత్రి రాజశేఖర్, గుమ్మడి నరేంద్ర, యెల్లేటి శ్రీనివాసరావు, డీవీ రమణారెడ్డి, నమ్మి సింహాద్రి పాల్గొన్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన మహిళా ఉద్యోగి

ఉక్కు ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో నినాదాలు చేస్తున్న మహిళా ఉద్యోగి ప్రతిమ ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో ఆమెను హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు.

రాత్రి 11 గంటలైనా ఆందోళన విరమించని ఉద్యోగులు

రాత్రి 11 గంటలైనా ఉద్యోగులు పట్టువిడవకుండా ఆందోళన కొనసాగించారు. ఉత్తర్వులను విరమించుంటామని యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళనను విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. కార్మిక నాయకులు అధికారులతో జరిపిన చర్చలు ఫలప్రదం కాకపోవడంతో ఆందోళనను కొనసాగించారు.

నేడు పవన్‌కల్యాణ్‌తో ఉక్కు పోరాట కమిటీ నాయకులు భేటీ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో భేటీ కానున్నారు. ఉదయం 11 గంటలకు నాయకులు పవన్‌తో సమావేశం కానున్నట్టు పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో నెలకొన్న పరిస్థితులు, కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగ భద్రత, ఉక్కు నిర్వాసితులకు ఉపాధి వంటి అంశాలపై చర్చించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.



'క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించాలి'

కంచరపాలెం, అక్టోబరు 5: విద్యార్థులు తమ లక్ష్యసాధనే ధ్యేయంగా శ్రమిస్తూ క్రమశిక్షణతో దూసుకుపోవాలని విశ్రాంత అధ్యాపకుడు బి.శ్రీరామ్మూర్తి హితవు పలికారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. విశ్రాంత జిల్లా వైద్యాధికారి డా.సుధాకర్ పట్నాయక్ మాట్లాడుతూ సమాజంలో గురువులు, విద్యార్థుల మధ్య ఉండే సంబంధాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సీహెచ్ జయప్రకాశ్ రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంత కుమారి, డి.దామోదర్ పాల్గొన్నారు.

2029 కల్లా విశాఖ రూపురేఖలు మారేలా ప్రాజెక్టులు

... 5వ పేజీ తరువాయి

జిల్లా వాటా 9.15 శాతంగా ఉందని, దీనిని 15 శాతం పెరిగేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. ప్రజలకు కావల్సిన కనీస అవసరాలను తీర్చుతూ, మౌలిక వసతులను కల్పిస్తూ, ప్రజారోగ్యం, సంక్షేమం దృష్ట్యా మరిన్ని ఉత్తమ చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. జిల్లాలో భూ వినియోగాన్ని పెంచాలని, విద్య, వైద్య రంగాల్లో నాణ్యత పెరగాలని, యువతలో నైపుణ్యం పెంచాలని, కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. వికసిత భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించనున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌పై మరిన్ని సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. 2047 కల్లా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సమ్మిళిత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేయాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ ఉండాలని ఆధునిక విధానాలు అనుసరించాలన్నారు. వర్క్‌షాపులో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి అల్లిపురం సమస్యలు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అల్లిపురం, అక్టోబరు 5: జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ శనివారం 32వ వార్డు పరిధిలోని అల్లిపురం, నేరెళ్లకోనేరు, చలువతోట, తారకరామ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజుతో కలసి పర్యటించారు. వార్డుల్లో సమస్యలను కమిషనర్ దృష్టికి నాగరాజు తీసుకొచ్చారు. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న ఏడుగుళ్ల ప్రాంత ప్రజలకు వారి స్థలంలోనే పక్కా ఇళ్లు నిర్మించాలన్న కార్పొరేటర్ వినతికి స్పందించిన కమిషనర్ నివేదిక తయారు చేయాలని నగర ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అలానే చలువతోట, నేరెళ్లకోనేరు, తారకరామ కాలనీ ప్రజలకు కల్యాణమండపాలు, సామాజిక భవనాల నిర్మాణానికి ప్రణాళికలుసిద్ధం చేయాలని సూచించారు. పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రాజు, జడ్సీ మల్లయ్యనాయుడు, నగర ప్రణాళికాధికారి ధనుంజయ రెడ్డి, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కొరడా

... 5వ పేజీ తరువాయి

చేయడంతో అక్కడి నుంచి కలెక్టర్‌కు, జీవీఎంసీ అధికారులకు నోటీసులు వచ్చాయి. ఫిర్యాదులో అంశాలపై నివేదిక ఇవ్వాలని, తగిన చర్యలు తీసుకోవాలని ఏపీసీజెడ్ఎంఏ ఆదేశించింది. ఇక తప్పదన్న భావనతో జీవీఎంసీ జోన్-1 కమిషనర్ ఇటు బే వాచ్ రిసార్ట్ నిర్వాహకులకు, అటు విరాగూ వ్యాపారవేత్తలకు నోటీసులు జారీచేశారు. ఆ భవనాల నిర్మాణాలకు తీసుకున్న అనుమతులు, తీర ప్రాంతంలో వ్యాపారాల నిర్వహణకు ఏపీసీజెడ్ఎంఏ ఇచ్చిన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు, ఆ స్థలం యాజమాన్య హక్కులపై కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల సంస్థ నుంచి ఎన్ఓసీ, జీవీఎంసీ అగ్నిమాపక విభాగం నుంచి ఎన్ఓసీ, ఇతర శాఖల నుంచి తీసుకున్న అనుమతులు ప్రతులను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. జీవీఎంసీ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారా?, అనుమతులు లేని కారణంగా వాటిని నిలుపు చేస్తారా? అనేది చూడాలి.

జల వనరుల శాఖ ఖాళీ

... 5వ పేజీ తరువాయి

నార్త్ కోస్ట్ సీఈగా సుగుణాకరరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

చోడవరంలో వాటర్‌షెడ్ డివిజన్ ఈఈగా ఉన్న త్రినాథం విశాఖపట్నం రెగ్యులర్ సర్కిల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా దాదాపు మూడేళ్ల నుంచి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న నర్సీపట్నం రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కూడా అదనపు బాధ్యతలు మోస్తున్నారు. పాడేరులోని చిన్ననీటి వనరుల విభాగం ఈఈ, పార్వతీపురం రెగ్యులర్ ఈఈ, జంఝావతి ప్రాజెక్టు ఈఈ, బొబ్బిలి సర్కిల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఉత్తరాంధ్రలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వంశధార, తోటపల్లి, రైవాడ, వెంగళరాయ, ఆంధ్ర, మడ్డువలస, తాండవ తదితర ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు పూర్తిస్థాయి అధికారులు లేరు. ముఖ్యంగా వరదల సమయంలో డ్యామ్‌ల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉత్తరాంధ్రలో పుష్కలంగా నీటి వనరులు ఉన్నప్పటికీ కేవలం పాతిక టీఎంసీలు నిల్వ చేసే ప్రాజెక్టులే నిర్మించారు. అదనంగా 25 టీఎంసీల కెపాసిటీతో వంశధారకు అనుకుని హిరమండలం రిజర్వాయర్ నిర్మాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. వంశధార నుంచి ఏటా 60 నుంచి 70 టీఎంసీలు, నాగావళి నుంచి 40 టీఎంసీల నీరు సముద్రం పాలవుతుంది. నీటిని సద్వినియోగం చేసుకునే ప్రాజెక్టులు నిర్మాణం మాటెలా ఉన్నా, ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు పర్యవేక్షించే ఎస్ఈ, ఈఈ పోస్టులను భర్తీచేయాలని ఇంజనీర్లు కోరుతున్నారు.

మెకానికల్ అక్రమాలపై కమిషనర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

వాహనాల నిర్వహణ, మరమ్మతుల కోసం పిలిచే టెండర్ల నుంచి వాటి పనితీరు పర్యవేక్షణ, బిల్లుల వరకూ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని కమిషనర్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. మెకానికల్ విభాగాన్ని రెండు నెలల్లో గాడిలో పెడతానని కౌన్సిల్‌లో కమిషనర్ సంపత్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వాహనాలకు పెట్రోల్/డీజిల్ వినియోగంలో కూడా పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని ఆయన గుర్తించారు. జీవీఎంసీకి చెందిన వాహనాలన్నింటికీ పెట్రోల్/డీజిల్ నింపేలా ఒక బంక్‌తో ఒప్పందం చేసుకున్నారు. ప్రతి నెలా సుమారు రూ.మూడు కోట్లు వరకూ చెల్లిస్తున్నారు. అయితే కొంతమంది అధికారులు తమ వ్యక్తిగత, కుటుంబసభ్యుల వాహనాలకు జీవీఎంసీ వాహనం పేరుతో ఇంధనం నింపుకుంటున్నట్టు కమిషనర్ గుర్తించారు. అలాగే మలేరియా, ప్రజారోగ్య విభాగానికి చెందిన వాహనాల సిబ్బంది కూడా డీజిల్/పెట్రోల్‌ను పక్కదారి పట్టిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నిర్వహించేలా రెండు బంకులను ఏర్పాటుచేయాలని కమిషనర్ నిర్ణయించారు. దీని కోసం ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. మరోవైపు వాహనాల మరమ్మతు గుట్టు విప్పడంపై కూడా కమిషనర్ దృష్టిపెట్టారు. అందులో భాగంగానే శనివారం ఉదయం ముడసర్లోవలోని జీవీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న గ్యారేజీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వాహనాల మరమ్మతులు జరుగుతున్న తీరుతో పాటు విడి భాగాలు అమర్చే పద్ధతి, వాడుతున్న పరికరాల బ్రాండ్‌లను కూడా పరిశీలించారు. టెండర్‌లో పొందుపరిచిన నిబంధనల మేరకు విడిభాగాల కొనుగోలు, అమరిక జరుగుతోందా?, లేదా? అని కూడా పరిశీలించారు. గ్యారేజీ ప్రాంగణంలో కొన్ని కొత్త వాహనాలు మూలనపడి ఉండడంతో కమిషనర్ ఆశ్చర్యం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఆయా వాహనాలను తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని మెకానికల్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. అక్కడ నుంచి కమిషనర్ నేరుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకుని, వాహనాల పనితీరుకు సంబంధించి జీపీఎస్ ట్రాకింగ్, వేయింగ్ మిషన్ల వద్ద నమోదవుతున్న వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వాహనాల రిపేర్లలో కొంత అనుమానాలు ఉండడంతో ప్రభుత్వ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మెకానికల్ విభాగంలో నిపుణుడైన ఇంజనీర్‌ను థర్డ్ పార్టీ కన్సల్టెంట్‌గా నియమించాలని మెకానికల్ ఎస్ఈ కృష్ణారావుకు సూచించారు. అలాగే నగరంలో చెత్త తరలింపు, పూడికతీత, రోడ్లు ఊడ్చే యంత్రాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి రోజువారీ నివేదికలు ఇవ్వాలని మెకానికల్ ఎస్ఈతోపాటు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌కు సంయుక్తంగా బాధ్యతలు అప్పగించారు. ఇకపై మెకానికల్ విభాగంలో అక్రమాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులకు కొందరు అభిప్రాయపడుతున్నారు.

కేంద్రానికి మద్దతు ఉపసంహరించండి

▸▸ కూటమి పార్టీలకు ఉక్కు ఉద్యమకారుల డిమాండ్



ఉద్యమానికి ఏకీభావం తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

సీతంపేట, అక్టోబరు 5: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను మొండిగా కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ, జనసేనలు ప్రకటన చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కన్వీనర్ వి.వి. రమణ మూర్తి మాట్లాడుతూ ఈ నెల 2న కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ పలు తీర్మానాలు ఆమోదించామన్నారు. తాము ప్రతిపాదించిన అంశాలకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్‌ను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందన్నారు. అందులో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, అధికారుల బదిలీ, కొందరు ఉద్యోగులను వీఆర్ఎస్ ద్వారా బయటకు పంపాలని నిర్ణయించారని తెలిపారు. ఈ చర్యలపై కేంద్రాన్ని నిలువరించేందుకు కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజల మనోభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు ఉపసంహరణ విషయం ప్రకటించకపోతే జనవరి 27న లక్ష మందితో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు నేడు మౌనం పాటిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు అచ్చిబాబు, ఎం.లక్ష్మి, పి.ఎస్. తిలక్, కె.ఎస్. చలం, సూర్య ప్రకాష్, జె.రవి, ఎస్.వెంకటలక్ష్మి, రామచంద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కటకటాల వెనక్కి కిలాడీ లేడీ

▸▸ ఎన్నారై ఫిర్యాదుతో కేసు నమోదు

భీమునిపట్నం, అక్టోబరు 5: ధనవంతుల కుర్రాళ్లను ప్రేమ పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బు గుంజే కిలాడీ లేడీని శనివారం భీమిలి పోలీసులు కటకటాల వెనక్కి పంపారు. శనివారం రాత్రి వారు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మురళీనగర్ ఎన్జీవో కాలనీకి చెందిన కొర్రుపోలు జామీమను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించడంతో కేంద్ర కారాగారానికి తరలించారు. నగరంలోని షీలా నగర్‌కు చెందిన యువకుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడితో ఇన్‌స్టాగ్రామ్‌లో జామీమ పరిచయం చేసుకుంది. తర్వాత ప్రేమ పేరిట మాయమాటలు చెబుతూ అతడి తల్లిదండ్రుల చిరునామా తెలుసుకుంది. వాళ్ల ఇంటికి వెళ్లి మీ అబ్బాయి స్నేహితురాలినంటూ కొన్ని రోజులు మంచిగా నటించింది. తర్వాత పెళ్లి ప్రతిపాదన తేవడంతో యువకుడి తల్లిదండ్రులు నిరాకరించారు.

తర్వాత పథకం ప్రకారం జామిమా మాయమాటలతో అమెరికాలో ఉంటున్న యువకుడిని విశాఖకు రప్పించింది. విమానాశ్రయం నుంచి నేరుగా మురళీనగర్‌లోని ఆమె ఇంటికి తీసుకెళ్లి మత్తు పదార్థాలు కలిపిన పానీయాలు తాగించింది. అతడు మైకంలో ఉన్న సమయంలో తనతో శారీరకంగా కలిసి ఉన్నట్లు ఫోటోలు తీసి నిశ్చితార్థం చేసుకోవాలని బెదిరించింది. ఆమె సహచరులను కూడా ఉసిగొల్పి వారి సహాయంతో బలవంతంగా భీమిలిలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి అక్కడ బలవంతంగా నిశ్చితార్థం జరిపించి, సంబంధిత ఫంక్షన్ ఖర్చు రూ.5 లక్షలు కూడా ఆ యువకుడి నుంచి రాబట్టింది. తమ తల్లిదండ్రులకు తెలిపి ఒప్పిస్తానని చెప్పినా వినలేదని పోలీసులకు బాధిత యువకుడు ఫిర్యాదు చేశాడు. పెళ్లి చేసుకోవాలంటూ ఓ ఇంటిలో తనను పెట్టి బయట తాళం వేసి వారి మనుషులతో బెదిరించేది. అమెరికా ఉద్యోగానికి వెళ్లకుండా చేస్తానని బెదిరిస్తూ డబ్బులు గుంజేదని పేర్కొన్నాడు. ఎలాగో ఆమె నుంచి తప్పించుకుని భీమిలి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు జమీమాను అరెస్ట్ చేసి ఆమె నుంచి ల్యాప్‌టాప్, ట్యాబ్, మూడు సెల్ ఫోన్‌లు, ఒక బాలినో కారు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె సమక్షంలోనే మురళీనగర్‌లోని ఆమె ఇంటిని తనిఖీ చేశామన్నారు. ఆమె సహచరులపైనా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'పటమటీది నాటకం' ఆవిష్కరణ



ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.ఎస్.చలం, ఇతర ప్రముఖులు

సీతంపేట, అక్టోబరు 5: ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా ఆధ్వర్యంలో మిరప మహేష్ రచించిన 'పటమటీది' నాటకం కవితా సంపుటిని శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ యూపీఎస్సీ సభ్యులు ఆచార్య కె.ఎస్. చలం విచ్చేశారు. అనంతరం కొన్ని కవితలను చదివి విశ్లేషించారు. సాహితీ విశ్లేషకులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ కవిత్వాన్ని విశ్లేషిస్తూ ప్రత్యేకతలను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, ఎస్.హనుమంతరావు, డాక్టర్ బండి సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి, మేకా రత్నరాజు పాల్గొన్నారు.

వీణా విద్వాంసురాలికి సత్కారం



బండి శ్యామలను సన్మానిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, అక్టోబరు 5: దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం బీవీకే కళాశాల కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో వీణానాదార్చన, వీణా విద్వాంసురాలు బండి శ్యామలకు 'మహతి నాదనిధి' బిరుదుతో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సంగీత విద్వాంసులు మండా సుధారాణి, పప్పు పద్మా రవిశంకర్‌లు విచ్చేసి బండి శ్యామలకు 'మహతి నాదనిధి' బిరుదుతో సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు. కామాక్షి దేవి వైశిష్ట్యాన్ని తెలుపుతూ రాసిన కృతులను సునయ, వైష్ణవి, విష్ణుప్రియ, ఆర్ఎస్ కృష్ణప్రియ, ఎన్‌వీఎస్ఎల్ ప్రసన్న, ఎన్.కృష్ణ ప్రియలు ఆలపించారు. 'మూక పంచాశతి' అనే కావ్యంలోని శ్లోకాలను, పలు కృతులను ఆలపించారు. ఈ కార్య నీట్ల కృష్ణవేణి పలు కృతులను వీణావాయిద్యంతో ఆలపించి ఆహూతులను అలరింపజేశారు.



మహిళను హోమ్‌కు తరలిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

మతిస్థిమితం లేని మహిళను 'హోమ్'కు తరలించిన పోలీసులు

గోపాలపట్నం, అక్టోబరు 5: మతిస్థిమితం లేని మహిళను ఆర్పీఎఫ్ సిబ్బంది సాయంతో నిరాశ్రయ గృహానికి తరలించారు. సింహాచలం రైల్వే స్టేషన్ పరిసరాల్లో మూడు రోజులుగా ఈ మహిళ సంచరిస్తుండడాన్ని గమనించిన ఆర్పీఎఫ్ ఎస్ఐ మమతా నాయక్ నగరంలోని మమత చారిటబుల్ ట్రస్టుకు సమాచారం అందించారు. ఈ మేరకు ట్రస్టు ప్రతినిధి మమత ఈ మహిళను ఆదర్శనగర్‌లోని మన కుటుంబం హోమ్‌కు తరలించారు. ఈ మహిళను మానసిక వైద్యశాలకు తరలించాక ఆమెను కుటుంబం చెంతకు చేర్చేలా చర్యలు చేపడతామని మమత తెలిపారు.

వృథాగా పోతున్న తాగునీరు


పైపు లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

పెదగంట్యాడ, అక్టోబరు 5: జీవీఎంసీ 64వ వార్డు పరిధి యాతపాలెంలో తాగునీరు వృథాగా పోతుంది. యాతపాలెం నుంచి పారిశ్రామిక వాడకు వెళ్లే ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ పైపు లైన్ పగిలిపోవడంతో తాగునీరు రోడ్డుపై పారుతూ డ్రైనేజీలో కలిసిపోతోంది. దీంతో తమకు కొళాయిల ద్వారా పూర్తి సామర్థ్యంతో నీరు రావడం లేదని యాతపాలెం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఏడాదిగా ఇలా నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని వాపోతున్నారు. ఇటీవల స్థానిక టీడీపీ నాయకుడు సంపంగి సూరిబాబు జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులకు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది వచ్చి పైపు లైన్ బాగు చేశారని, అయితే మళ్లీ నాలుగు రోజులకే పరిస్థితి మొదటికొచ్చిందని పేర్కొంటున్నారు. అందువల్ల అధికారులు స్పందించి పైపు లైన్‌కు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పలు ప్రాంతాల్లో అన్న సమారాధన

సింధియా, అక్టోబరు 5: జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డు కాలనీలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం చేపట్టిన అన్న సమారాధనను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభిచారు. కార్యక్రమంలో డీపీ బాయ్స్, కాలనీ పెద్దలు, షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి-రూరల్: మండలంలోని చింతలఅగ్రహారం రామాలయం వద్ద నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధన చేపట్టారు. సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 5: దంత, నేత్ర వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన కలిగివుండడంతో పాటు వాటి నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. రాంనగర్‌లో గీతం ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సుమారు 200 మందిని పరీక్షించి వైద్య సిబ్బంది మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడివాడ లతీష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శ్వాగ్:** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **దక్షిణ :** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **రామ్‌నగర్ బన్నీ:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 72, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 46, బీరకాయలు 55, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 20, క్యారెట్ 48 దొండకాయలు 60, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 85, మునక్కాడలు (కిలో) 95, బరబాటి 46, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 84, గోరుచిక్కుడు 38, దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 98, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 44, కంద 62, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ 1లో..


అగనంపూడిలో కురుస్తున్న వర్షం


బొట్టవానిపాలెం రోడ్డులో చెట్టు కొమ్మ విరిగిపడడంతో ఒరిగిన విద్యుత్ స్తంభం

పారిశ్రామిక ప్రాంతంలో భారీ వర్షం

ఈదురు గాలులకు బొట్టవానిపాలెంలో హైమాస్ట్ స్తంభంపై కూలిపడిన చెట్టు కొమ్మ

తెగిపడిన విద్యుత్ వైర్లు

కూర్మన్నపాలెం, అగనంపూడిల్లో జలమయమైన లోతట్టు ప్రాంతాలు

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 5: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి 87వ వార్డు పరిధి బొట్టవానిపాలెం రోడ్డులో ఓ చెట్టు కొమ్మ హైమాస్ట్ విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో విద్యుత్ వైర్లు తెగిబడ్డాయి. అయితే ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలిసి కార్పొరేటర్ బొండా జగన్ విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు సరఫరా నిలిపివేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కురిసిన గాలి వానకు కూర్మన్నపాలెం, ఆటోనగర్, బొట్టవానిపాలెం, తదితర ఏరియాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జమమయంగా మారాయి. అసలే భారీ గోతులతో అంతంతమాత్రంగా ఉన్న రోడ్లన్నీ వర్షానికి మరింత అధ్వానంగా మారాయి. వుడా నగర్, దువ్వాడ, మంగళపాలెం, యాదవకాపు జగ్గరాజుపేటతో పాటు ఆటోనగర్‌లో పలు కర్మాగారాలకు వెళ్లే ప్రధాన రహదారిలోని గోతుల్లో వర్షపు నీరు పెద్దఎత్తున చేరడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించిన ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత వైసీపీ పాలనలో కనీస మరమ్మతులకు కూడా ఈ రోడ్లు నోచుకోలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా రహదారుల మరమ్మతులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. అలాగే గాజువాక, శ్రీహరిపురం, ఉక్కు టౌన్‌షిప్‌లలోనూ భారీ వర్షం కురిసింది.


జలమయమైన వుడా నగర్ రోడ్డు

అగనంపూడి: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి వర్షపు నీరు పెద్దఎత్తున ప్రవహించింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఉక్కపోత, ఎండతో తల్లడిల్లిన ప్రజలు ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లబడి భారీ వర్షం కురవడంతో ఊరట చెందారు. కాగా నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు నీరు రహదారుల పైకి రావడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు.

విశాఖలో సెంట్రల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు కృషి

కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం ప్రదానం

విశాఖపట్నం, అక్టోబరు 5: విశాఖలో సెంట్రల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు కృషిచేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. నగరంలోని పిఠాపురం కాలనీలో గల కళాభారతి ఆడిటోరియంలో శనివారం కిన్నెర ఆర్ట్స్ థియేటర్ సంస్థ నిర్వహించిన అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ముగింపు ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. నటుడు, నిర్మాత మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమకు ఆణిముత్యం అక్కినేని అని కొనియాడారు. అక్కినేని పురస్కారానికి అర్హుడు మురళీమోహనే అన్నారు. తాను కొత్తలో ఎంపీగా లోక్‌సభలో మాట్లాడడానికి భయపడుతూ ఉంటే మురళీమోహనే ధైర్యం చెప్పి పంపించారన్నారు. రాష్ట్రానికి మరిన్ని విమాన సర్వీసులు తీసుకొస్తానని, అలాగే స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్రంతో చర్చిస్తానన్నారు. పురస్కార గ్రహీత మురళీమోహన్ మాట్లాడుతూ తనకు కింజరాపు ఎర్రన్నాయుడు మంచి మిత్రుడని, ఆయన కుమారుడు రామ్మోహన్‌నాయుడు తండ్రికి తగ్గ తనయుడిగా పనిచేస్తున్నారని కొనియాడారు. మద్రాస్ నుంచి తెలుగు సినీరంగాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత నాగేశ్వరరావుదేనన్నారు. హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తామంటేనే ఆయన డేట్లు ఇచ్చేవారని పేర్కొన్నారు. అన్నపూర్ణ బ్యానర్‌లో తొలి సినిమా తనతోనే నిర్మించడం తన అదృష్టమని, ఆయన పేరిట అవార్డును తనకు ప్రదానం చేయడంతో జన్మ తరించిందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, సాహితీవేత్త పార్వతీశం, కృష్ణప్రసాద్, రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.


అగనంపూడి దుర్గమాంబ ఆలయంలో శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

జయహో దుర్గా భవానీ..

వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు


చినముషిడివాడ సప్తగిరినగర్‌లో ధైర్యలక్ష్మి అలంకరణలో అలివేలు మంగాదేవి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 5: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలోని శనివారం శ్రీమహాదుర్గ అమ్మవారిని గాయత్రీదేవిగా, శ్రీమహాలక్ష్మిని ధైర్యలక్ష్మిగా, శ్రీమహా సరస్వతిని శారదాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే గాజులతో అర్చన, సామూహిక సహస్ర అర్చనను ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ నిర్వహించారు.

అగనంపూడి: ఇక్కడి పోస్టాఫీసు వద్దనున్న దుర్గమాంబ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి సారెను ఊరేగించారు. బొర్రమాంబ పారాయణ సేవాసమితి ప్రతినిధులు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. పెదమడక కొండపై ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సమీపం దుర్గా కాలనీలోని దుర్గమాంబ ఆలయంలో అమ్మవారు శాకాంబరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించగా, ఆలయ ధర్మకర్త కాండ్రేగుల జగ్గారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాదనలో అధిక సంఖ్యలో భవానీ భక్తులతో స్థానికులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: గ్రేటర్ 88వ వార్డు పరిధి ఎస్టీబీఎల్ ఎల్ఎస్ గార్డెన్స్‌లో పోలమాంబ అమ్మవారిని గాయత్రీదేవిగా పసుపు, కుంకుమల ప్యాకెట్లతో శోభాయమానంగా ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు బాలాజీ, జీవీ కృష్ణయ్య, గంగామహేశ్, చైతన్య కృష్ణ, వినోద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 70వ వార్డు ఎల్వీ నగర్‌లోని కనక దుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని రాజేశ్వరీదేవిగా అలంకరించి పంచామృతాభిషేకాలు, పూజలు జరిపారు. డ్రైవర్స్ కాలనీలోని కనక దుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భవానీ భక్తులు కనకదుర్గమ్మకు సారెను ఊరేగింపు తీసుకువచ్చి నివేదించారు.


షీలానగర్ దుర్గమాంబ కాలనీలో శాకంబరిగా దుర్గాదేవి


ఎల్ఎస్ గార్డెన్స్‌లో పసుపు, కుంకుమ ప్యాకెట్లతో పోలమాంబ అలంకరణ

పెందుర్తి: ఇక్కడి ప్రశాంతి నగర్‌లోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని, వెంకటాద్రి శిఖరం దిగువనున్న మహాకామేశ్వరి ద్వాదశ సహిత జ్యోతిర్లింగాలయంలోని అమ్మవారిని, ఎస్ఆర్‌పురంలోని కనకదుర్గ ఆలయంలోని అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అలాగే చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీదేవి ఆలయంలో పూజలు జరిపారు. చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవిని ధైర్యలక్ష్మిగా, శారదాపీఠం అధి ష్టాన దేవత రాజశ్యామల అమ్మవారిని వైష్ణవీదేవిగా అలంకరించి పూజలు చేయగా, పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శారదా పీఠం యాగశాలలో చండీహోమాన్ని, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, సువాసిని పూజలు జరిపారు. తొలుత పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రలు ఆలయాల్లోని దేవతా మూర్తులకు పంచామృతాభిషేకాలు చేశారు.

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం గవరపాలెం కాలనీలోని గీతాకృష్ణ మందిరంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

గోపాలపట్నం: ఇక్కడి కొత్తపాలెంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన సామూహిక పూజల్లో పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్ గుడివీధిలోని దుర్గాదేవి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. నాయుడుతోట గాయత్రీదేవి ఆలయంలోని అమ్మవారిని అన్నపూర్ణదేవిగా ఆలంకరించి పూజలు చేశారు. రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం పఠించారు. వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు జరపగా, అప్పన్నపాలెం సమీపంలోని వర్షిణి టవర్స్ జీ-బ్లాక్‌లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి వద్ద, బుచ్చిరాజుపాలెం దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15,714 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు

వేపగుంట అక్టోబరు 5: నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఇస్పత్రిలో ఈ ఏడాది ఇప్పటివరకు 15,714 మందికి కంటి చికిత్సలు, సుమారు లక్ష మంది అవుట్ పేషెంట్లకు సేవలందించినట్టు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక వైద్య సేవలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని అనేక మారుమూల గ్రామాల్లో 276 ఉచిత కంటివైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 17,612 మందికి నేత్ర పరీక్షలు, శస్త్ర చికిత్సలు అందించి వారిని తిరిగి స్వగ్రామాలకు పంపామన్నారు. 1997 నుంచి ఇప్పటివరకు 4,58,297 కంటి శస్త్ర చికిత్సలు, 26,66,463 మంది అవుట్ పేషెంట్లకు నేత్ర పరీక్షలు నిర్వహించి అరుదైన ఘనత సాధించినట్టు వివరించారు.

ఆస్పత్రిలో అత్యాధునాతన ఆపరేషన్ థియేటర్లతో రెటినా ఇంజెక్షన్లు, గ్లకోమా, కార్నియా, పీడియాట్రిక్ కంటి వైద్యం, అర్బిట్ అక్యూలో ప్లాస్టీ తదితర రోగాలకు ఉత్తమ వైద్యసేవలందిస్తున్నట్టు పేర్కొన్నారు. గాజువాక ఓపీ విభాగంలో 8,067 మందికి, మధురవాడలో 3,747 మందికి నేత్ర పరీక్షలు చేసి నాణ్యమైన వైద్య సేవలందించారు. గడిచిన త్రైమాసికంలో ఉత్తమ ఫలితాల సాధనలో వైద్యులు, సిబ్బంది కృషి ఎంతో చేశారని సంస్థ జీఎం రాధాకృష్ణన్ అభినందించారన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగిస్తామని బంగార్రాజు పేర్కొన్నారు.


సుపథ మండపం వద్ద భక్తులు

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, అక్టోబరు 5: వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. విద్యా సంస్థలకు దసరా సెలవులు కావడంతో నగరంలోని నలుమూలలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా, పశ్చిమ బెంగాల్ నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రద్దీ కొనసాగింది. సూర్యోదయానికి ముందే భక్తులు కొండదిగువకు చేరుకుని స్వామివారి పుష్కరిణిలో స్నానాలు చేసి భైరవస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి కొందరు మెట్ల మార్గంలోనూ, మరికొందరు రోడ్డు మార్గంలోనూ సింహగిరికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీఘ్ర దర్శనం, ఉచిత దర్శ నం క్యూల వద్ద ఎక్కువ రద్దీ కనిపించింది.


మానవహారాన్ని సక్సెస్ చేయాలని నినాదాలు చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

మానవహారాన్ని విజయవంతం చేయాలి

నేటి ఉదయం పాత గాజువాక నుంచి అగనంపూడి వరకు నిర్వహణ

ఉక్కు కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 5: స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలని, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చేపట్టనున్న మానవహారాన్ని విజయవంతం చేయాలని ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరారు. ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు చేపట్టనున్న మానవహారాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ప్లాంటులో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అగనంపూడి జాతీయ రహదారి నుంచి పాత గాజువాక వరకు భారీ ఎత్తున మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కేంద్రం చర్యలు తీసుకోవాలని, ప్రైవేటీకరణ అంశాన్ని పూర్తిగా విరమించుకోవాలని, ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు తగిన వసతులు కల్పించాలన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించి ఆదుకోవడంతో పాటు ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మసేన్‌రావు, జెర్రిపోతుల ముత్యాలు, బొడ్డు పైడిరాజు, జి.గణపతిరెడ్డి, వీవీ రమణమూర్తి, డి.అప్పారావు, పి.రెడ్డి, నాయుడు, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఆదివారం ఉదయం పాత గాజువాక నుంచి అగనంపూడివరకు చేపట్టనున్న మానవహారం కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడమే మనందరి ధ్యేయం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, కేఎస్ఎన్ రావు, ఎస్.రామారావు, యు.రామస్వామి, ఎస్.రామచంద్రరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శనివాడలో ప్రచారం

అగనంపూడి: ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం ఆదివారం తలపెట్టిన మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివాడ వేపచెట్టు కూడలి వద్ద ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ప్లకార్డులు పట్టుకుని అగనంపూడి నుంచి పాత గాజువాక వరకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులందరూ తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు వంకర రాము, ఎస్.గోవిందరావు, ఎ.అప్పారావు, మరడయ్య, సాంబశివరావు, నీలకంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

'డాక్‌యార్డు' ఎన్నికల్లో ఐఎన్‌సీఈ విజయఢంకా


డాక్‌యార్డు వర్క్స్ కమిటీ ఎన్నికల్లో విజయం అభ్యర్థులు, తదితరులు

మల్కాపురం, అక్టోబరు 5: నేవల్ డాక్‌యార్డు వర్క్స్ కమిటీ ఎన్నికల్లో చక్రం గుర్తుపై పోటీ చేసిన ఇండియన్ నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌సీఈ) విజయఢంకా మోగించింది. కాగడా గుర్తుపై పోటీ చేసిన ఐఎన్‌సీఎంఎస్ అభ్యర్థులు ముగ్గురు విజయం సాధించగా, స్టార్ గుర్తుపై పోటీలో నిలిచిన నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అభ్యర్థి ఒక్కరికి మాత్రమే విజయం వరించింది. చక్రం గుర్తుపై పోటీ చేసిన గుజ్జు సురేశ్‌రెడ్డి, కీరు విజయ్‌కుమార్, పి.రంగనాధం, కె.లక్ష్మి శ్రీధర్, బి. శ్రీనివాసరావు (వాసు), ముర్ర నరేశ్ గెలుపొందారు. కాగడా గుర్తుపై పోటీచేసిన ముత్తిరెడ్డి శ్రీనివాస్, రెడ్డిపల్లి యోగిత, జగదేశ్వరరావు విజయం సాధించారు. స్టార్ గుర్తుపై పోటీచేసిన పీఎంఎల్ నాయుడుకు ఒక్కరికి మాత్రమే విజయం దక్కించుకున్నారు. పదిమందిలో విజయం సాధించిన ఆరుగురు ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అభ్యర్థులు కావడంతో సెక్రటరీ, వైస్ చైర్మన్‌లుగా వారే ఎన్నిక కానున్నారు. మిగిలిన వారంతా సభ్యులుగానే ఉంటారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఐఎన్‌సీఈ యూనియన్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

విజేతలకు అభినందనలు

వర్క్స్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులను డాక్‌యార్డు ఇండియన్ నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు భోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.చిన్నారావు, కోశాధికారి శేఖర్, ఇంటక్ నాయకులు అప్పలరాజు, ఆదినారాయణమూర్తి, ఆనంద్ బిసాయ్, టీఎన్‌టీయూసీ నాయకులు వి.శంకర్, ఎస్వీ రమణ; ఎస్సీఎస్టీ నాయకులు, తదితరులు అభినందించారు.

మోహరించిన పోలీసులు

ఇదిలాఉండగా డాక్‌యార్డు వర్క్స్ కమిటీ ఎన్నికలను నిలిపేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం అందడంతో శుక్రవారం రాత్రి పది గంటల నుంచే డాక్‌యార్డు పరిసర ప్రాంతాల్లో పోలీసులు పెద్దఎత్తున మోహరించాయి. డాకయార్డు ఉద్యోగుల కుటుంబాలు ఈ ఎన్నికను నిలిపివేసేందుకు అధిక సంఖ్యలో చేరుకుంటారని ప్రచారం సాగింది. దీంతో మల్కాపురం, న్యూపోర్టు, హార్బర్ సర్కిల్స్‌కు చెందిన సిబ్బందితో పాటు సీఐలు, ఎస్ఐలు అక్కడకు చేరుకున్నారు. శనివారం ఎనిమిది గంటల తర్వాత వాతావరణం ప్రశాంతంగా ఉండడంతో ఎన్నికలు సజావుగా సాగాయి.

ఏడాకుల చెట్లను తొలగించాలని ఆందోళన

అగనంపూడి, అక్టోబరు 5: స్థానికంగా గల ఏడాకుల చెట్లను తొలగించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెదమడక శివాలయం రోడ్డులో రెండు వైపులా నాటిన ఏడాకుల చెట్ల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం పూత దశలో ఈ చెట్లు ఉన్నందున వాసన విపరీతంగా వస్తుందని, ఈ కారణంగా చిన్నారులకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ చెట్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మిత్తపాటి జగదీశ్, బలిరెడ్డి సత్యనారాయణ, పద్మ, మీనాక్షి, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుంటే జరిమానా: సీఐ

సింధియా, అక్టోబరు 5: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని హార్బర్ డివిజన్ ట్రాఫిక్ సీఐ ఎస్. షణ్ముఖరావు ఆదేశించారు. శనివారం మల్కాపురం కూడలిలో తమ సిబ్బందితో కలిసి ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అందువల్ల ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనక కూర్చున్న వారు హెల్మెట్ ధరించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటివరకు 1,500 మంది వాహనచోదకుల లైసెన్స్‌ను సస్పెండ్ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత నగరంలో మౌలిక వసతులకు సుధాకర్ వినతి



అమరావతిలో మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ దక్షిణ నియోజకవర్గ నేత ఎస్.సుధాకర్

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గంలో మౌలిక వసతులు మెరుగుపర్చడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శీతంరాజు సుధాకర్ కోరారు. శనివారం విజయవాడలో లోకేశ్‌ను కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాత నగరంలో శిథిలమైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లను మరమ్మతు చేయాలని, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను పటిష్టం చేసేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. తాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని, పోర్టుకాలుష్యం తగ్గింపునకు తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. పాత నగరాన్ని ఆధునీకీకరించేలా ప్రణాళిక అమలుచేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.



డాబాగార్డెన్స్‌లో అన్నపూర్ణేశ్వరిగా



సీతంపేటలో అన్నపూర్ణేశ్వరి అవతారం



సీతమ్మధారలో మీనాక్షిగా..



కుమ్మరివీధిలో పోలమాంబ అమ్మవారు

మాతా అన్నపూర్ణేశ్వరీ...పాహిమాం

సీతమ్మధార, అక్టోబరు 5: శరన్నవరాత్రి ఉత్సవాలు ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో వైభవంగా జరుగుతున్నాయి. సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్సన్‌లోని షిరిడి సాయిబాబా, ప్రసన్న వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి దేవాలయాల్లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రసన్న వెంకటేశ్వరస్వామిని తిరుమల వెంకటేశుని అవతారంలో అలంకరించారు. అలాగే దుర్గాదేవి అమ్మవారు మీనాక్షి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద పంపిణీ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతంపేటలోని పార్వతీశ్వర దేవాలయంలో పార్వతీదేవి అన్నపూర్ణేశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుంటున్నారు.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లోని శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భార్గవశర్మ సంప్రదాయ పద్ధతులతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. దివ్య మంగళహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో జీవీ రమాభాయి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగదాంబకూడలి: సుమారు వందేళ్ల చరిత్ర గల బహుముఖరూపాల పోలమాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటున్నారు. శనివారం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తిభజన గీతాలాపన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పోలమ్మకు భక్తితో నమస్కరించి మొక్కులు తీర్చుకున్నారు. నగరంలో ప్రఖ్యాతి గాంచిన దుర్గాలమ్మ శనివారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం మరో అలంకారం కోసం సిద్ధం చేస్తున్నారు.

మురళీనగర్; దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మురళీనగర్ బాలయోగి గుడి దగ్గర శనివారం అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి, టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అతిథులుగా హాజరై భోజనాలు వడ్డించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అతిథులు ఉత్సవ నిర్వాహకుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, బాలయోగి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించాలి'

కంచరపాలెం, అక్టోబరు 5: విద్యార్థులు తమ లక్ష్యసాధనే ధ్యేయంగా శ్రమిస్తూ క్రమశిక్షణతో దూసుకుపోవాలని విశ్రాంత అధ్యాపకుడు బి.శ్రీరామ్మూర్తి హితవు పలికారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. విశ్రాంత జిల్లా వైద్యాధికారి డా.సుధాకర్ పట్నాయక్ మాట్లాడుతూ సమాజంలో గురువులు, విద్యార్థుల మధ్య ఉండే సంబంధాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సీహెచ్ జయప్రకాశ్ రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంత కుమారి, డి.దామోదర్ పాల్గొన్నారు.

2029 కల్లా విశాఖ రూపురేఖలు మారేలా ప్రాజెక్టులు

... 5వ పేజీ తరువాయి

జిల్లా వాటా 9.15 శాతంగా ఉందని, దీనిని 15 శాతం పెరిగేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. ప్రజలకు కావల్సిన కనీస అవసరాలను తీర్చుతూ, మౌలిక వసతులను కల్పిస్తూ ప్రజారోగ్యం, సంక్షేమం దృష్ట్యా మరిన్ని ఉత్తమ చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. జిల్లాలో భూ వినియోగాన్ని పెంచాలని, విద్య, వైద్య రంగాల్లో నాణ్యత పెరగాలని, యువతలో నైపుణ్యం పెంచాలని, కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. వికసిత భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించనున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌పై మరిన్ని సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. 2047 కల్లా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సమ్మిళిత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేయాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ ఉండాలని ఆధునిక విధానాలు అనుసరించాలన్నారు. వర్క్‌షాపులో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి అల్లిపురం సమస్యలు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అల్లిపురం, అక్టోబరు 5: జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ శనివారం 32వ వార్డు పరిధిలోని అల్లిపురం, నేరెళ్లకోనేరు, చలువతోట, తారకరామ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజుతో కలసి పర్యటించారు. వార్డుల్లో సమస్యలను కమిషనర్ దృష్టికి నాగరాజు తీసుకొచ్చారు. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న ఏడుగుళ్ల ప్రాంత ప్రజలకు వారి స్థలంలోనే పక్కా ఇళ్లు నిర్మించాలన్న కార్పొరేటర్ వినతికి స్పందించిన కమిషనర్ నివేదిక తయారు చేయాలని నగర ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అలానే చలువతోట, నేరెళ్లకోనేరు, తారకరామ కాలనీ ప్రజలకు కల్యాణమండపాలు, సామాజిక భవనాల నిర్మాణానికి ప్రణాళికలుసిద్ధం చేయాలని సూచించారు. పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రాజు, జడ్సీ మల్లయ్యనాయుడు, నగర ప్రణాళికాధికారి ధనుంజయ రెడ్డి, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి మద్దతు ఉపసంహరించండి

▸▸ కూటమి పార్టీలకు ఉక్కు ఉద్యమకారుల డిమాండ్



ఉద్యమానికి ఏకీభావం తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

సీతంపేట, అక్టోబరు 5: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను మొండిగా కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ, జనసేనలు ప్రకటన చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కన్వీనర్ వి.వి. రమణ మూర్తి మాట్లాడుతూ ఈ నెల 2న కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ పలు తీర్మానాలు ఆమోదించామన్నారు. తాము ప్రతిపాదించిన అంశాలకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్‌ను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందన్నారు. అందులో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, అధికారుల బదిలీ, కొందరు ఉద్యోగులను వీఆర్‌ఎస్ ద్వారా బయటకు పంపాలని నిర్ణయించారని తెలిపారు. ఈ చర్యలపై కేంద్రాన్ని నిలువరించేందుకు కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజల మనోభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు ఉపసంహరణ విషయం ప్రకటించకపోతే జనవరి 27న లక్ష మందితో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు నేడు మౌనం పాటిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు అచ్చిబాబు, ఎం.లక్ష్మి, పి.ఎస్. తిలక్, కె.ఎస్. చలం, సూర్య ప్రకాష్, జె.రవి, ఎస్.వెంకటలక్ష్మి, రామచంద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కటకటాల వెనక్కి కిలాడీ లేడీ

▸▸ ఎన్నారై ఫిర్యాదుతో కేసు నమోదు

భీమునిపట్నం, అక్టోబరు 5: ధనవంతుల కుర్రాళ్లను ప్రేమ పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బు గుంజే కిలాడీ లేడీని శనివారం భీమిలి పోలీసులు కటకటాల వెనక్కి పంపారు. శనివారం రాత్రి వారు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మురళీనగర్ ఎన్జీవో కాలనీకి చెందిన కొర్రుపోలు జామీమను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించడంతో కేంద్ర కారాగారానికి తరలించారు. నగరంలోని షీలా నగర్‌కు చెందిన యువకుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడితో ఇన్‌స్టాగ్రామ్‌లో జామీమ పరిచయం చేసుకుంది. తర్వాత ప్రేమ పేరిట మాయమాటలు చెబుతూ అతడి తల్లిదండ్రుల చిరునామా తెలుసుకుంది. వాళ్ల ఇంటికి వెళ్లి మీ అబ్బాయి స్నేహితురాలినంటూ కొన్ని రోజులు మంచిగా నటించింది. తర్వాత పెళ్లి ప్రతిపాదన తేవడంతో యువకుడి తల్లిదండ్రులు నిరాకరించారు.

తర్వాత పథకం ప్రకారం జామిమా మాయమాటలతో అమెరికాలో ఉంటున్న యువకుడిని విశాఖకు రప్పించింది. విమానాశ్రయం నుంచి నేరుగా మురళీనగర్‌లోని ఆమె ఇంటికి తీసుకెళ్లి మత్తు పదార్థాలు కలిపిన పానీయాలు తాగించింది. అతడు మైకంలో ఉన్న సమయంలో తనతో శారీరకంగా కలిసి ఉన్నట్లు ఫోటోలు తీసి నిశ్చితార్థం చేసుకోవాలని బెదిరించింది. ఆమె సహచరులను కూడా ఉసిగొల్పి వారి సహాయంతో బలవంతంగా భీమిలిలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి అక్కడ బలవంతంగా నిశ్చితార్థం జరిపించి, సంబంధిత ఫంక్షన్ ఖర్చు రూ.5 లక్షలు కూడా ఆ యువకుడి నుంచి రాబట్టింది. తమ తల్లిదండ్రులకు తెలిపి ఒప్పిస్తానని చెప్పినా వినలేదని పోలీసులకు బాధిత యువకుడు ఫిర్యాదు చేశాడు. పెళ్లి చేసుకోవాలంటూ ఓ ఇంటిలో తనను పెట్టి బయట తాళం వేసి వారి మనుషులతో బెదిరించేది. అమెరికా ఉద్యోగానికి వెళ్లకుండా చేస్తానని బెదిరిస్తూ డబ్బులు గుంజేదని పేర్కొన్నాడు. ఎలాగో ఆమె నుంచి తప్పించుకుని భీమిలి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు జమీమాను అరెస్ట్ చేసి ఆమె నుంచి ల్యాప్‌టాప్, ట్యాబ్, మూడు సెల్ ఫోన్‌లు, ఒక బాలినో కారు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె సమక్షంలోనే మురళీనగర్‌లోని ఆమె ఇంటిని తనిఖీ చేశామన్నారు. ఆమె సహచరులపైనా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'పటమటీది నాటకం' ఆవిష్కరణ



ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.ఎస్.చలం, ఇతర ప్రముఖులు

సీతంపేట, అక్టోబరు 5: ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా ఆధ్వర్యంలో మిరప మహేష్ రచించిన 'పటమటీది' నాటకం కవితా సంపుటిని శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ యూపీఎస్‌సీ సభ్యులు ఆచార్య కె.ఎస్. చలం విచ్చేశారు. అనంతరం కొన్ని కవితలను చదివి విశ్లేషించారు. సాహితీ విశ్లేషకులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ కవిత్వాన్ని విశ్లేషిస్తూ ప్రత్యేకతలను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, ఎస్.హనుమంతరావు, డాక్టర్ బండి సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి, మేకా రత్నరాజు పాల్గొన్నారు.

వీణా విద్వాంసురాలికి సత్కారం



బండి శ్యామలను సన్మానిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, అక్టోబరు 5: దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం బీవీకే కళాశాల కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో వీణానాదార్చన, వీణా విద్వాంసురాలు బండి శ్యామలకు 'మహతి నాదనిధి' బిరుదుతో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సంగీత విద్వాంసులు మండా సుధారాణి, పప్పు పద్మా రవిశంకర్‌లు విచ్చేసి బండి శ్యామలకు 'మహతి నాదనిధి' బిరుదుతో సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు. కామాక్షి దేవి వైశిష్ట్యాన్ని తెలుపుతూ రాసిన కృతులను సునయ, వైష్ణవి, విష్ణుప్రియ, ఆర్ఎస్ కృష్ణప్రియ, ఎన్‌వీఎస్ఎల్ ప్రసన్న, ఎస్.కృష్ణ ప్రియలు ఆలపించారు. 'మూక పంచాశతి' అనే కావ్యంలోని శ్లోకాలను, పలు కృతులను ఆలపించారు. ఈ కార్య నీట్ల కృష్ణవేణి పలు కృతులను వీణావాయిద్యంతో ఆలపించి ఆహూతులను అలరింపజేశారు.

సైన్స్ అండ్ టెక్నాలజీపై సదస్సు

జ్ఞానాపురం, అక్టోబరు 5: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో అధునాతన సైన్స్ అండ్ టెక్నాలజీపై వృక్ష శాస్త్రం, బయోటెక్నాలజీ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి విభాగాల ఆధ్వర్యంలో శనివారం సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ ముఖ్యఅతిథిగా హాజరై నావల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీ డైరెక్టర్ అబ్రహం వర్గీస్‌తో కలసి దీన్ని ప్రారంభించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో కాలానుగుణ మార్పులు, అధునాతన ఆవిష్కరణలను అందరూ పంచుకోవటానికి ఈ సెమినార్ వేదిక అని అన్నారు. మరో అతిథిగా హాజరైన గీతం కళాశాల ప్రొఫెసర్ డా.పి.శాంతిలత విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డా.ఎం.పద్మసుందరి, కో-కన్వీనర్లు డా.ఎ.వీరబ్రహ్మం, ఊర్మిళ, సిస్టర్ హేమ, డా.అరుణా దేవి, డా.ఇ.హరిణి, డా.పి.కె. జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల ఆందోళన...

5వ పేజీ తరువాయి

ఇచ్చింది. ఇప్పుడు యూనిట్‌కు ఎనిమిది రూపాయల చొప్పున (గడిచిన ఏప్రిల్ నుంచి సెప్టెంబరు) వసూలు చేయాలని నిర్ణయం తీసుకుని, ఆ మేరకు సెప్టెంబరు నెల జీతాల నుంచి మినహాయించుకుంది. ఈ రెండు అంశాలపై ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని, విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాత్రి తొమ్మిదిన్నరకూ ఆందోళన కొనసాగిస్తున్నారు.

యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది: అఖిలపక్ష కార్మిక నాయకులు

ఉక్కు యాజమాన్యం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు ధ్వజమెత్తారు. ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తుందన్నారు ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తికి చర్యలు చేపట్టకుండా కేవలం ఉద్యోగుల తొలగింపు, ఇతర సంస్థలకు తరలింపు, ఆర్థిక ప్రయోజనాల్లో కోత విధింపు వంటి వాటిపై దృష్టి సారించిందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంకా పాత జీతాలతోనే స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు కాలం గడుపుతున్నారని, అవి కూడా సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. హెచ్‌ఆర్‌ఏను పునరుద్ధరించాలని, విద్యుత్ బిల్లులు రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, మంత్రి రాజశేఖర్, గుమ్మడి నరేంద్ర, యెల్లేటి శ్రీనివాసరావు, డీవీ రమణారెడ్డి, నమ్మి సింహాద్రి పాల్గొన్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన మహిళా ఉద్యోగి

ఉక్కు ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో నినాదాలు చేస్తున్న మహిళా ఉద్యోగి ప్రతిమ ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో ఆమెను హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు.

రాత్రి 11 గంటలైనా ఆందోళన విరమించని ఉద్యోగులు

రాత్రి 11 గంటలైనా ఉద్యోగులు పట్టువిడవకుండా ఆందోళన కొనసాగించారు. ఉత్తర్వులను విరమించుంటామని యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళనను విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. కార్మిక నాయకులు అధికారులతో జరిపిన చర్చలు ఫలప్రదం కాకపోవడంతో ఆందోళనను కొనసాగించారు.

నేడు పవన్‌కల్యాణ్‌తో ఉక్కు పోరాట కమిటీ నాయకులు భేటీ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో భేటీ కానున్నారు. ఉదయం 11 గంటలకు నాయకులు పవన్‌తో సమావేశం కానున్నట్టు పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో నెలకొన్న పరిస్థితులు, కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగ భద్రత, ఉక్కు నిర్వాసితులకు ఉపాధి వంటి అంశాలపై చర్చించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

జీవీఎంసీ కొరడా

... 5వ పేజీ తరువాయి

చేయడంతో అక్కడి నుంచి కలెక్టర్‌కు, జీవీఎంసీ అధికారులకు నోటీసులు వచ్చాయి. ఫిర్యాదులో అంశాలపై నివేదిక ఇవ్వాలని, తగిన చర్యలు తీసుకోవాలని ఏపీసీజెడ్ఎంఏ ఆదేశించింది. ఇక తప్పదన్న భావనతో జీవీఎంసీ జోన్-1 కమిషనర్ ఇటు బే వాచ్ రిసార్ట్ నిర్వాహకులకు, అటు విరాగూ వ్యాపారవేత్తలకు నోటీసులు జారీచేశారు. ఆ భవనాల నిర్మాణాలకు తీసుకున్న అనుమతులు, తీర ప్రాంతంలో వ్యాపారాల నిర్వహణకు ఏపీసీజెడ్ఎంఏ ఇచ్చిన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు, ఆ స్థలం యాజమాన్య హక్కులపై కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల సంస్థ నుంచి ఎన్ఓసీ, జీవీఎంసీ అగ్నిమాపక విభాగం నుంచి ఎన్ఓసీ, ఇతర శాఖల నుంచి తీసుకున్న అనుమతులు ప్రతులను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. జీవీఎంసీ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారా?, అనుమతులు లేని కారణంగా వాటిని నిలుపు చేస్తారా? అనేది చూడాలి.

జల వనరుల శాఖ ఖాళీ

... 5వ పేజీ తరువాయి

నార్త్ కోస్ట్ సీఈగా సుగుణాకరరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

చోడవరంలో వాటర్‌షెడ్ డివిజన్ ఈఈగా ఉన్న త్రినాథం విశాఖపట్నం రెగ్యులర్ సర్కిల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా దాదాపు మూడేళ్ల నుంచి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న నర్సీపట్నం రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కూడా అదనపు బాధ్యతలు మోస్తున్నారు. పాడేరులోని చిన్ననీటి వనరుల విభాగం ఈఈ, పార్వతీపురం రెగ్యులర్ ఈఈ, జంఝావతి ప్రాజెక్టు ఈఈ, బొబ్బిలి సర్కిల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఉత్తరాంధ్రలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వంశధార, తోటపల్లి, రైవాడ, వెంగళరాయ, ఆంధ్ర, మడ్డువలస, తాండవ తదితర ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు పూర్తిస్థాయి అధికారులు లేదు. ముఖ్యంగా వరదల సమయంలో డ్యామ్‌ల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉత్తరాంధ్రలో పుష్కలంగా నీటి వనరులు ఉన్నప్పటికీ కేవలం పాతిక టీఎంసీలు నిల్వ చేసే ప్రాజెక్టులే నిర్మించారు. అదనంగా 25 టీఎంసీల కెపాసిటీతో వంశధారకు అనుకుని హిరమండలం రిజర్వాయర్ నిర్మాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. వంశధార నుంచి ఏటా 60 నుంచి 70 టీఎంసీలు, నాగావళి నుంచి 40 టీఎంసీల నీరు సముద్రం పాలవుతుంది. నీటిని సద్వినియోగం చేసుకునే ప్రాజెక్టులు నిర్మాణం మాటెలా ఉన్నా, ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు పర్యవేక్షించే ఎస్ఈ, ఈఈ పోస్టులను భర్తీచేయాలని ఇంజనీర్లు కోరుతున్నారు.

మెకానికల్ అక్రమాలపై కమిషనర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

వాహనాల నిర్వహణ, మరమ్మతుల కోసం పిలిచే టెండర్ల నుంచి వాటి పనితీరు పర్యవేక్షణ, బిల్లుల వరకూ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని కమిషనర్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. మెకానికల్ విభాగాన్ని రెండు నెలల్లో గాడిలో పెడతానని కౌన్సిల్‌లో కమిషనర్ సంపత్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వాహనాలకు పెట్రోల్/డీజిల్ వినియోగంలో కూడా పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని ఆయన గుర్తించారు. జీవీఎంసీకి చెందిన వాహనాలన్నింటికీ పెట్రోల్/డీజిల్ నింపేలా ఒక బంక్‌తో ఒప్పందం చేసుకున్నారు. ప్రతి నెలా సుమారు రూ.మూడు కోట్లు వరకూ చెల్లిస్తున్నారు. అయితే కొంతమంది అధికారులు తమ వ్యక్తిగత, కుటుంబసభ్యుల వాహనాలకు జీవీఎంసీ వాహనం పేరుతో ఇంధనం నింపుకుంటున్నట్టు కమిషనర్ గుర్తించారు. అలాగే మలేరియా, ప్రజారోగ్య విభాగానికి చెందిన వాహనాల సిబ్బంది కూడా డీజిల్/పెట్రోల్‌ను పక్కదారి పట్టిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నిర్వహించేలా రెండు బంకులను ఏర్పాటుచేయాలని కమిషనర్ నిర్ణయించారు. దీని కోసం ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. మరోవైపు వాహనాల మరమ్మతు గుట్టు విప్పడంపై కూడా కమిషనర్ దృష్టిపెట్టారు. అందులో భాగంగానే శనివారం ఉదయం ముడసర్లోవలోని జీవీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న గ్యారేజీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వాహనాల మరమ్మతులు జరుగుతున్న తీరుతో పాటు విడి భాగాలు అమర్చే పద్ధతి, వాడుతున్న పరికరాల బ్రాండ్‌లను కూడా పరిశీలించారు. టెండర్‌లో పొందుపరిచిన నిబంధనల మేరకు విడిభాగాల కొనుగోలు, అమరిక జరుగుతోందా?, లేదా? అని కూడా పరిశీలించారు. గ్యారేజీ ప్రాంగణంలో కొన్ని కొత్త వాహనాలు మూలనపడి ఉండడంతో కమిషనర్ ఆశ్చర్యం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఆయా వాహనాలను తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని మెకానికల్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. అక్కడ నుంచి కమిషనర్ నేరుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకుని, వాహనాల పనితీరుకు సంబంధించి జీపీఎస్ ట్రాకింగ్, వేయింగ్ మిషన్ల వద్ద నమోదవుతున్న వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వాహనాల రిపేర్లలో కొంత అనుమానాలు ఉండడంతో ప్రభుత్వ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మెకానికల్ విభాగంలో నిపుణుడైన ఇంజనీర్‌ను థర్డ్ పార్టీ కన్సల్టెంట్‌గా నియమించాలని మెకానికల్ ఎస్ఈ కృష్ణారావుకు సూచించారు. అలాగే నగరంలో చెత్త తరలింపు, పూడికతీత, రోడ్లు ఊడ్చే యంత్రాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి రోజువారీ నివేదికలు ఇవ్వాలని మెకానికల్ ఎస్ఈతోపాటు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌కు సంయుక్తంగా బాధ్యతలు అప్పగించారు. ఇకపై మెకానికల్ విభాగంలో అక్రమాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులకు కొందరు అభిప్రాయపడుతున్నారు.



కల్యాణం చేస్తున్న అర్చకులు

కమనీయం..అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం,అక్టోబరు 5 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవల తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కుమ్మరి వీధి రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సింహాచలం, అక్టోబరు 5 : అప్పన్న గ్రామ తిరువీధికి అనుకూలంగా కుమ్మరివీధి కూడలిలోని రోడ్డుకు దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. గతనెల 26న 'దసరాకు అప్పన్న తిరువీధి ఉత్సవం జరిగేనా' అన్న శీర్షికన వచ్చిన కథనానికి ఈఓ త్రినాథరావు స్పందించారు. ఈమేరకు ఈఈ రాంబాబుతో కలిసి కుమ్మరివీధి కూడలిని పరిశీలించారు. తక్షణమే ఉత్సవ నిర్వహణకు ఆటంకం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ శాఖను ఆదేశించారు. ఉత్సవం ప్రారంభానికి ముందే బీటీ రోడ్డు నిర్మించి స్వామివారి రథం తిరిగేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఈఓ చెప్పారు.

పీఏసీఎస్ మహాజన సభ రేపు

మధురవాడ, అక్టోబరు 5 : మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ సోమవారం ఉదయం 11 గంటలకు సంఘం ఆవరణలో జరగనున్నట్టు పీఏసీఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం. రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో లాకర్ల కొనుగోలు, ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రం నిర్వహణ, 2023-24 ఆర్థిక సంవత్సరం ఆడిట్‌తో పాటు జమా ఖర్చులపై చర్చించనున్నట్టు చెప్పారు. సభ్యులంతా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు

ఆరిలోవ, అక్టోబరు 5 : జీవీఎంసీ 13వ వార్డు ఎస్ఎస్ఎన్ నగర్‌లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొందరు వ్యక్తులు ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి ప్లాట్లుగా వేస్తుండడంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు వారు ఆక్రమణలను తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

సింహగిరిపై భారీ వర్షం



సింహాచలం, అక్టోబరు 5 : సింహగిరిపై శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచీ ఎండ తీవ్రత అధికంగా ఉండగా, మధ్యాహ్నం 1 గంట సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో భక్తులు సూర్య తాపం నుంచి ఉపశమనం పొందారు.

సినిమా గైడ్

- **శ్వాగ్:** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **దక్షిణ :** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **రామ్‌నగర్ బన్నీ:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 72, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 46, బీరకాయలు 55, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 20, క్యారెట్ 48 దొండకాయలు 60, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 95, అల్లం (పాతది) 85, బరబటి 46, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 84, గోరుచిక్కుడు 38, దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 98, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 44, కంద 62, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 30, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 110
ఫారం ధర	-- 130
విత్ స్కిన్	-- 230
స్కిన్‌లెస్	-- 240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

పనుల్లో నాణ్యత లేకపోతే చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, అక్టోబరు 5 : కాంట్రాక్టర్లు చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం ఉంటే చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్ హెచ్చరించారు.శనివారం ఆయన జీవీఎంసీ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా కాంట్రాక్టర్లు వివరించిన ధరావత్తు సొమ్ము చెల్లింపు, పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపు, ఇసుక కొనుగోలులో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సీఎస్ఎంఎస్ ద్వారా పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు, స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ గ్రాంట్ పనులు, పెండింగ్‌లో ఉన్న ఏఎస్‌డీ, ఎఫ్ఎస్‌డీ, చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ నిధుల స్థితికి అనుగుణంగా ప్రతిఒక్కరికి ప్రాధాన్యతా క్రమంలో బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈఎండీఏ ఎస్‌డీ, ఎఫ్ఎస్‌డీ తదితర బిల్లులను కూడా పరిగణనలోకి తీసుకొని చెల్లింపులకు సంబంధించిన చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ఎక్కడా నాణ్యతా లోపం తలెత్తకుండా చూడాలని చెప్పారు. అలాగే ప్రజా ప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. చేపట్టిన పనులను మధ్యలో విడిచిపెట్టడం, జాప్యం చేయడం, నాణ్యతా లోపం జరిగినట్టుయితే సంబంధిత కాంట్రాక్టర్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంజనీరింగ్ అధికారులు కూడా కాంట్రాక్టర్లు చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



కాపుల దిబ్బడిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన

భీమునిపట్నం, అక్టోబరు 5 : రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన 4వ వార్డు కాపుల దిబ్బడిపాలెం, రెడ్డీలపాలెం, నిడిగట్టు గ్రామాల్లో జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న సీసీ కాలువలు, రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలీన గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాపుల దిబ్బడిపాలెంలో రూ.19.20 లక్షలు, రెడ్డీలపాలెంలో రూ.19.50 లక్షలు, నిడిగట్టులో రూ.19 లక్షలతో కాలువలు, రోడ్లు నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ప్రేమ ప్రసన్న వాణి, ఈఈ విజయదుర్గ, ఏఈ సుమన్, నాలుగో వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సూరాడ రవి, వాసుపల్లి పోలమ్మ, నారు ఎల్లాజీ, పోతిన అప్పలరాజు, బీజేపీ నాయకుడు రామానాయుడు, పాల్గొన్నారు.



బయో డైవర్సిటీ పార్కు నిర్వాహకులతో కమిషనర్ విశ్వనాథన్

మొక్కలంటే చాలా ఇష్టం

- వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

పెదవాల్తేరు, అక్టోబరు 5 : మొక్కలంటే తనకు చాలా ఇష్టమని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. శనివారం ఆయన పెదవాల్తేరులో రాణి చంద్రమణి దేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న బయో డైవర్సిటీ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కు నిర్వాహకులు అరుదైన వృక్ష జాతులను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలన్నారు.పార్కులో దేశ విదేశాలకు చెందిన ఆర్కిడ్స్ ఎడారి మొక్కలు, శ్రీగంధం, అశ్వ గంధం, ఎర్ర చందనం, పవిత్ర వృక్షాలు, ఔషధ గుణాలున్న మొక్కలతో పాటు అరుదైన జాతులు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆయన పార్కు పరిసరాలను పరిశీలించి దశల వారీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్కు నిర్వాహకులు రామ్మూర్తి, శాంతి స్వరూప్, డీఎఫ్ఓ శ్యామల, సిబ్బంది రవికుమార్, మోహన్ పాల్గొన్నారు.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే : గరికపాటి



గరికిపాటి దంపతులకు అప్పన్న స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న శ్రీనివాసాచార్యులు

సిరిపురం, అక్టోబరు 5 : అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో శనివారం రాత్రి రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో జరిగిన దేవీ వైభవం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దసరా రోజుల్లోనే కాకుండా ప్రతిరోజూ అమ్మవారిని పూజించాలన్నారు. అనేక రూపాల్లో మానవాళిని రక్షించేందుకు అమ్మవారు అవతారమెత్తారన్నారు. మహిమ గల అమ్మవారు ఎంతో పవిత్రమైనదని, ఆధ్యాత్మిక చింతన, భక్తిభావం కలిగి ఉన్నవారికి భగవంతుడు అనుగ్రహం నిరంతరం ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనులను ఇబ్బందులకు గురిచేయరాదని పేర్కొన్నారు. అనంతరం సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు స్వామివారి చిత్రపటాన్ని గరికపాటి దంపతులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ ప్రోగ్రామ్ చైర్మన్ జగన్‌మోహన్, ప్రెసిడెంట్ వినయగాంధీ, సెక్రటరీ మణిమాల, కోశాధికారి కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో చిరు వ్యాపారుల బైఠాయింపు



సర్వీస్ రోడ్డులో బైఠాయించి, నినాదాలు చేస్తున్న చిరు వ్యాపారులు

కొమ్మాది, అక్టోబరు 5 : మధురవాడ సర్వీసు రోడ్డులో ప్రతి శనివారం నిర్వహించే సంతను పోలీసులు అడ్డుకున్నారు. సంత సర్వీసు రోడ్డులో కాకుండా కొమ్మాది జంక్షన్ నుంచి కొమ్మాది గ్రామంలోకి వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు చెప్పడంతో చిరు వ్యాపారులు సీఐటీయూ నాయకులతో కలిసి సర్వీసు రోడ్డులో బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే ట్రాఫిక్ సీఐ కాంతారావు అక్కడికి చేరుకుని వ్యాపారులు, సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్డులో కొంత స్థలం విడిచిపెట్టి సంత ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించడంతో వ్యాపారులు ఆందోళన విరమించారు.

భీమిలిలో మండల స్థాయి కోలాటం పోటీలు

భీమునిపట్నం, అక్టోబరు 5 : దసరా ఉత్సవాల్లో భాగంగా మండల స్థాయిలో కోలాటం పోటీలు నిర్వహించను న్నట్టు ఎంపీడీఓ హనుమంతరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో శ్రీమతి గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. జూనియర్లు, సీనియర్ల విభాగాల్లో పోటీలు జరుగుతాయని, తహసీల్దార్, ఎంపీడీవో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన వారికి ఈనెల 12న పట్టణంలోని ఎమ్మెల్యే గంటా కార్యాలయం వద్ద ఫైనల్ పోటీలు నిర్వహించి, విజేతలను నిర్ణయిస్తార న్నారు. ప్రథమ స్థానానికి రూ. 50,116 వేలు, ద్వితీయ స్థానానికి రూ.25,116 వేలు, తృతీయ స్థానానికి రూ.15,116 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తారన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 8వ తేదీలోగా తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

శిల్పారామంలో దసరా ఉత్సవాలు ప్రారంభం

మధురవాడ, అక్టోబరు 5 : శిల్పారామంలో శనివారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు నగరానికి చెందిన సిద్ధేంద్రయోగి నాట్యాలయం కళాకారులు శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. లిఖిత, నక్షిత, సాన్వి, చిన్మయి, యశ్విత, మోక్షిత, హాస్య పలు కీర్తనలకు నృత్యాలు చేశారు.

బాక్సింగ్ పోటీల్లో శొంఠ్యాం విద్యార్థికి బంగారు పతకం

ఆనందపురం, అక్టోబరు 5 : మండలంలోని శొంఠ్యాం సమీపంలో ఉన్న ఎన్ఎస్ఆర్ ఐటీ కళాశాలలో సీఎస్ఎం ప్రథమ సంవత్సరం చదువుతున్న జి. అజయ్ జాతీయ స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. అజయ్ ఉత్తరాఖండ్‌లోని డిండిగల్‌లో గత నెల 27 నుంచి 30 వరకు జరిగిన పోటీల్లో పాల్గొని ఈ ఘనత సాధించాడు. కళాశాల కరస్పాండెంట్ ప్రసాద రాజు, ప్రిన్సిపాల్ శంభు ప్రసాద్, తదితరులు విద్యార్థిని అభినందించారు.

మానవహారాన్ని విజయవంతం చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణ

కూర్మన్నపాలెం, అక్టోబరు 5 : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఆదివారం ఉదయం పాత గాజువాక నుంచి అగనంపూడివరకు చేపట్టనున్న మానవహారం కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడమే మనందరి ధ్యేయం కావాలన్నారు. ఉద్యమాలతో ఏర్పడిన స్టీల్ ప్లాంటును ఉద్యమాలతోనే కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు జె. అయోధ్యరామ్, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, కేఎస్ఎన్ రావు, ఎన్. రామారావు, యు. రామస్వామి, రామచంద్రరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎండాడలో శాకంబరి అలంకరణలో అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ



జిమ్‌సర్‌లో గాయత్రీదేవిగా రాజరాజేశ్వరీ అమ్మవారు



పెదవాల్తేరులో గాయత్రీదేవిగా కరకచెట్టు పోలమాంబ



భీమిలిలో అన్నపూర్ణాదేవిగా పద్మావతి అమ్మవారు



సింహాచలంలో అన్నపూర్ణగా దుర్గమ్మ దర్శనం

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ

ఎండాడ, అక్టోబరు 5 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శాకంబరి అలంకరణలో అన్నపూర్ణదేవిగా శనివారం పూజలందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించారు. అలాగే జిమ్‌సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరీ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆరిలోవ : హనుమంతవాక జంక్షన్‌కి సమీపంలో ఉన్న విజయదుర్గా కాలనీలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

సింహాచలం/భీమునిపట్నం : సింహాచలం ప్రధాన కూడలిలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. భీమిలిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధానార్చకుడు అమ్మవారికి మహిళలతో కుంకుమ పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : కరకచెట్టు పోలమాంబ ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో కుంకుమార్చనలు, చండీ హోమం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సుందరకాండ పారాయణం, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

విశాఖలో సెంట్రల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు కృషి

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం ప్రదానం

మద్దిలపాలెం, అక్టోబరు 5 : విశాఖలో సెంట్రల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు కృషిచేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. నగరంలోని పిఠాపురం కాలనీలో గల కళాభారతి ఆడిటోరియంలో శనివారం కిన్నెర ఆర్ట్స్ థియేటర్ సంస్థ నిర్వహించిన అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ముగింపు ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. నటుడు, నిర్మాత మురళీమోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమకు ఆణిముత్యం అక్కినేని అని కొనియాడారు. అక్కినేని పురస్కారానికి అర్హుడు మురళీమోహనేనన్నారు. తాను కొత్తలో ఎంపీగా లోక్‌సభలో మాట్లాడడానికి భయపడుతూ ఉంటే మురళీమోహనే ధైర్యం చెప్పి పంపించారన్నారు. రాష్ట్రానికి మరిన్ని విమాన సర్వీసులు తీసుకొస్తానని, అలాగే స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని చెప్పారు. పురస్కార గ్రహీత మురళీమోహన్ మాట్లాడుతూ తనకు కింజరాపు ఎర్రన్నాయుడు మంచి మిత్రుడని, ఆయన కుమారుడు రామ్మోహన్‌నాయుడు తండ్రికి తగ్గ తనయుడిగా పనిచేస్తున్నారని కొనియాడారు. మద్రాస్ నుంచి తెలుగు సినీరంగాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనతా నాగేశ్వరరావుదేనన్నారు. హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తామంటేనే ఆయన డేట్లు ఇచ్చేవారని చెప్పారు. అన్నపూర్ణ బ్యానర్‌లో తొలి సినిమా తనతోనే నిర్మించడం తన అదృష్టమని చెప్పారు. ఆయన అవార్డు తనకు ప్రదానం చేయడంతో జన్మ తరించిందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, సాహితీవేత్త పార్వతీశం, కృష్ణప్రసాద్, రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

అక్కినేని కుటుంబానికి కొండ సురేఖ క్షమాపణ చెప్పాలి

తెలంగాణ మంత్రి కొండా సురేఖ అక్కినేని కుటుంబానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని మాజీ ఎంపీ, సినీ నటుడు మురళీ మోహన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. సురేఖ వ్యాఖ్యలను ఖండించారు. చివర వరకు సౌమ్యుడిగా పేరుపొందిన అక్కినేని నాగేశ్వరరావు కుటుంబంపై మంత్రి తీవ్ర విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. సోషల్ మీడియాలో అవాకులు చవాకులు పేలితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

స్వరూపానందకు కేటాయించిన భూములను రద్దు చేయాలని వినతి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 5 : వైసీపీ ప్రభుత్వ హయాంలో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి కేటాయించిన భూములను రద్దు చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వరూపానందేంద్రకు కేటాయించిన భూములను ప్రభుత్వం రద్దు చేసి, జర్నలిస్టులకు పంపిణీ చేయాలని కోరారు. స్వరూపానందేంద్ర గత ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరించారని ఆరోపించారు. రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహానికి శిరచ్ఛేదన జరిగినా కనీసం స్పందించ లేదన్నారు. తాజాగా తిరుమల లడ్డూ కల్తీ వివాదంలో కూడా ఆయన స్పందన లేదని చెప్పారు. ఇవన్నీ చూస్తుంటే.. అసలు ఆయన హిందువేనా అన్న అనుమానం కలుగుతుందన్నారు.

సింహగిరిపై స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, అక్టోబరు 5 : నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై శనివారం స్వాతి నక్షత్ర హవనం నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. యజ్ఞకర్తగా సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో తెచ్చి కల్యాణ మండపంలో అధిష్ఠింపజేశారు. శాస్త్ర విధానాన్ని అనుసరించి మండపారాధన, కలశారాధన, బింబారాధన చేశారు. అనంతరం ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేసి, హవనాన్ని జరిపారు. అర్చకులు భక్తులతో కలిసి పూర్ణకలశంతో ఆలయ ప్రదక్షిణ చేసిన తరువాత అంతరాలయంలో మూల విరాట్ వద్ద పూజలు జరిపారు. మహా పూర్ణాహుతి అనంతరం మంగళనీరాజనాలిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు పాల్గొనగా ఏఈఓ ఆనందకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



సుపథ మండపం వద్ద భక్తులు

సింహాచలం, అక్టోబరు 5 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. విద్యా సంస్థలకు దసరా సెలవులు కావడంతో నగరంలోని నలుమూలలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా, పశ్చిమ బెంగాల్ నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రద్దీ కొనసాగింది. సూర్యోదయానికి ముందే భక్తులు కొండదిగువకు చేరుకుని స్వామివారి పుష్కరిణిలో స్నానాలు చేసి భైరవస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి కొందరు మెట్ల మార్గంలోనూ, మరికొందరు రోడ్డు మార్గంలోనూ సింహగిరికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం క్యూల వద్ద ఎక్కువ రద్దీ కనిపించింది.

అప్పన్నను దర్శించుకున్న కర్నూల్ ఎంపీ నాగరాజు

సింహాచలం, అక్టోబరు 5 : వరాహలక్ష్మీనృసింహస్వామిని కర్నూల్ ఎంపీ బి. నాగరాజు పంచలింగాల శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ ఆనంద కుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఎంపీ గోత్రనామాలతో అర్చకులు అంతరాలయంలో పూజలు చేయగా గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, ఏఈఓ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

స్వచ్ఛ దేవాలయం ప్రాజెక్టు ప్రారంభం

సిరిపురం, అక్టోబరు 5 : పాండురంగస్వామి ఆలయంలో స్వచ్ఛ దేవాలయం ప్రాజెక్టును రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్. సుజాత, ఆలయ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. లక్ష విరాళం

వెంకోజీపాలెం, అక్టోబరు 5 : రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం ఏయూ అనుబంధ కళాశాలల ఆల్ సెయింట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.లక్ష విరాళం ప్రకటించింది. ఈమేరకు సంస్థ చైర్మన్ డాక్టర్ వి. విద్య సుందర్ శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావును కలిసి చెక్కు అందించారు. ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టీవీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.